


హేలాపురిలో యువజనోత్సవాలు

ప్రజాశక్తి - ఏలూరు

జాతీయ యువజనోత్సవాల్లో భాగంగా సెట్‌వెల్ ఆధ్వర్యంలో శనివారం వేగవరం హేలాపురి కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో వివిధ పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా యువతకు వక్తృత్వ, వ్యాసరచన, డిబేట్, క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని ఈ నెల 12న నిర్వహించే జిల్లాస్థాయి జాతీయ యువజనోత్సవంలో సర్టిఫికెట్‌తోపాటు మెమెంటోను అందజేస్తామని సెట్‌వెల్ మేనేజర్ పివిఎన్.సత్యనారాయణ చెప్పారు. జిల్లాస్థాయి జాతీయ యువజనోత్సవాలను ఈ నెల 12వ తేదీ ఏలూరు కలెక్టరేట్‌లోని సెట్‌వెల్ కార్యాలయంలో నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పర్యాటకశాఖ మేనేజర్ ఎస్.పట్టాభిరామన్న, కళాశాల ప్రిన్సిపల్ రాధాకృష్ణ, ఎఒ కరుణానిధి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మందకొడిగా రబీ నాట్లు..!

రెండు జిల్లాల్లో మూడున్నర లక్షల ఎకరాల్లో సాగు

ఇప్పటి వరకూ 70 వేల ఎకరాల్లో మాత్రమే నాట్లు

జనవరి రెండో వారం వచ్చినా 20 శాతం దాటని దుస్థితి

నెలాఖరు వరకూ నాట్లు కొనసాగే అవకాశం

20వ తేదీ తర్వాత వంతుల విధానం అమల్లోకి!

కొల్లేరు భూములు ఇ-క్రాప్ సంగతేమిటి?

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రెండు జిల్లాల్లోనూ మందకొడిగా రబీనాట్లు సాగుతున్నాయి. ఖరీఫ్ ధాన్యం కొనుగోలులో నెలకొన్న ఆలస్యం రబీ సాగుపై పడింది. దీంతో జనవరి రెండో వారం వచ్చినా 20 శాతం మాత్రమే రబీ నాట్లు పూర్తయ్యాయి. ప్రస్తుత రబీలో పశ్చిమగోదావరి జిల్లాలో 2.50 లక్షల ఎకరాలు, ఏలూరు జిల్లాలో 1,09,895 ఎకరాల్లో రైతులు రబీ సాగు చేస్తున్నారు. ఖరీఫ్ మాసూళ్లు త్వరితగతిన పూర్తయినప్పటికీ ధాన్యం కొనుగోలులో నెలకొన్న ఇబ్బందులతో రైతులు రబీ సాగులో ముందుకెళ్లలేకపోయారు. దీంతో జనవరి రెండోవారం వచ్చినప్పటికీ పశ్చిమగోదావరి జిల్లాలో 43 వేల ఎకరాల్లో, ఏలూరు జిల్లాలో 27 వేల ఎకరాల్లో మాత్రమే రబీ నాట్లు పూర్తయ్యాయి. అంటే రెండు జిల్లాల్లోనూ కలిపి 20 శాతం వరకూ నాట్లు జరిగాయి. ఇంకా దాదాపు 80 శాతం నాట్లు వేయాల్సి ఉంది. జనవరి నెలాఖరు వరకూ రబీ నాట్లు సాగే అవకాశం ఉందని దీన్నిబట్టి తెలుస్తోంది. జనవరి 20వ తేదీ తర్వాత వంతులవారీ విధానం అమల్లోకి తెచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అదే జరిగితే రైతులు సాగునీటి సమస్యను ఎదుర్కొనే ప్రమాదం ఉంది. దీంతో రైతుల్లో ఒకింత ఆందోళన సైతం నెలకొంది. రబీలో నాట్లు త్వరితగతిన పూర్తయ్యేలా అధికారులు తగిన చర్యలు తీసుకోలేకపోయారనే చర్చ నడుస్తోంది. రెండు జిల్లాల్లోనూ అత్యధికంగా బెంగాలీ కూలీలు రబీ నాట్లు వేసే ప్రక్రియలో పాల్గొంటున్నారు. ఎకరానికి రూ.నాలుగు వేలు చొప్పున కాంట్రాక్ట్‌కు తీసుకుని జిల్లాలో నాట్లు వేస్తున్నారు. ఇప్పటికే ఖరీఫ్ ధాన్యం కొనుగోలులో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న రైతులు రబీ మాసూళ్ల సమయానికి పరిస్థితి ఎలా ఉంటుందనే ఆందోళన సైతం ఇప్పటి నుంచే వెంటాడుతోంది. ఖరీఫ్‌లో తెచ్చిన నూతన ధాన్యం కొనుగోలు విధానంపై రైతుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. తేమశాతం, తూకం తేడాల పేరుతో రైతుల నుంచి మిల్లర్లు డబ్బు తిరిగి కట్టించుకోవడాన్ని రైతులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఇదే పరిస్థితి రబీలో ఎదురైతే ఏమిటనే ప్రశ్న రైతులను వెంటాడుతోంది.



కొల్లేరు భూములకు ఇ-క్రాప్ ఎలా..!

రెండు జిల్లాల పరిధిలోని దెందులూరు, భీమడోలు, ఉంగుటూరు, నిడమర్రు, ఆకివీడు, కైకలూరు వంటి పలు మండలాల పరిధిలో కొల్లేరు భూముల్లో రైతులు సాగు చేశారు. వీటిని అనసరి భూములంటారు. ఈ భూములకు సంబంధించి ప్రభుత్వం ఇచ్చిన పట్టాదారు పాస్‌పుస్తకాలు ఉండవు. వందల ఏళ్ల నుంచి రైతులు పన్ను కట్టి సాగు చేసుకుంటున్న భూములివి. ఇ-క్రాప్ కాని భూములకు సంబంధించి ధాన్యం కొనుగోలు చేయడం సాధ్యం కాదని ప్రభుత్వం చెబుతోంది. మరీ పట్టాదారు పాస్ పుస్తకాలు లేని కొల్లేరు భూములను రైతులు ఇ-క్రాప్ ఏవిధంగా చేసుకోవాలనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఇ-క్రాప్ చేయకపోతే రబీ సాగు పూర్తయ్యాక రైతులు ధాన్యం ఏవిధంగా విక్రయించాలో తెలియని పరిస్థితి ఏర్పడనుంది. కొల్లేరులో సాగైన వరి భూములకు సంబంధించి ఇ-క్రాప్ నమోదుపై జిల్లా ఉన్నతాధికారులు ఇప్పటి నుంచే సరైన నిర్ణయం తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. రబీ ధాన్యం కొనుగోలులో ఇబ్బంది పెడితే తమ పరిస్థితి అగమ్యగోచరంగా మారనుందని చెబుతున్నారు. కొల్లేరు భూముల్లోని ధాన్యం కొనుగోలుపై అధికారులు స్పష్టత ఇవ్వాల్సి ఉంది.

జిఒ నెం.1 ప్రతుల దహనం

సిపిఎం ఆధ్వర్యాన నిరసన

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

సభలు, సమావేశాలు, ప్రదర్శనలు నిర్వహించరాదంటూ రాష్ట్రప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జిఒ నెం.1ని తక్షణం రద్దు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానికంగా సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. అనంతరం జిఒ నెం.1 ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తాను నిర్వహించిన పాదయాత్ర, నిరసన కార్యక్రమాలు గుర్తు లేవా అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వ తీరు ప్రజాస్వామ్య హక్కులకు విరుద్ధమని ఆయన విమర్శించారు. పౌరహక్కులను హరించే ఈ జిఒను తక్షణం రద్దు చేయాలని, లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తెల్లం రామకృష్ణ, ఎం.నాగమణి, జిల్లా కమిటీ సభ్యులు ఎం.జీవరత్నం, టి.సత్యనారాయణ, నేతలు పోలోజు నాగేశ్వరరావు, కె.భాస్కర్, చోడెం దుర్గ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

విఒటి చట్టం 9/77ను సమర్థవంతంగా అమలు చేయాలి

ప్రజాశక్తి - ఏలూరు

రాష్ట్ర ప్రభుత్వం అసైన్డ్ భూములను రెగ్యులర్ చేయాలా? వద్దా? అని విచారించడానికి మంత్రి ధర్మాన ప్రసాదరావు నేతృత్వంలో మంత్రులు, శాసన సభ్యులతో నియమించిన కమిటీని రద్దుచేయాలని, విఒటి చట్టం 9/77ను సమర్థవంతంగా అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శనివారం డిఆర్‌ఒ ఎఒకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ, తలారి ప్రకాష్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం అనంతరం 1954 నుండి 2009 వరకూ వామపక్షాలు, వ్యవసాయ కార్మిక సంఘాలు, ప్రజాసంఘాలు, అభ్యుదయ వాదులు చేసిన అనేక పోరాటాల వల్ల రాష్ట్రంలో సుమారు 30 లక్షల ఎకరాలకుపైగా పేదలకు ప్రభుత్వాలు అసైన్డ్ చేశాయన్నారు. ఈ భూములను రాష్ట్రంలో పలుకుబడి కల్గిన వారు, పెత్తందారులు, రాజకీయ నాయకులు, దళారులు పేదలను మభ్యపెట్టి అదిరించి, బెదిరించి బలవంతంగానో, పావలానో, పాతికో ఇచ్చి సుమారు 15 లక్షల ఎకరాల భూములను లాక్కొన్నట్లు కోనేరు రంగారావు భూ కమిటీ తెలిపిందన్నారు. అన్యాక్రాంతమైన భూములను పేదలకు తిరిగి అప్పజెబుతామని 2007లో ఆనాటి ముఖ్యమంత్రి కీర్తిశేషులు రాజశేఖర్ రెడ్డి అసెంబ్లీలో వాగ్దానం చేశారని తెలిపారు. అనంతరం వచ్చిన ప్రభుత్వాలు గానీ, రాజశేఖర్ రెడ్డి వారసుడిగా వచ్చిన జగన్ గానీ ఆ హామీని నేరవేర్చక పోగా రాష్ట్రంలో భూముల విలువ పెరిగిన తర్వాత దళిత, బలహీన వర్గాల పేదల భూములను మరింత దోచుకోవడం పెరిగిందని విమర్శలు చేశారు. పేదల భూములను సంపన్నులకు కట్టబెట్టడానికి 9/77 చట్టం అడ్డం వస్తుందని, ఆ చట్టం యొక్క పీక నొక్కడానికి ధర్మాన ప్రసాదరావు నేతత్వంలో వేసిన కమిటీ ఉద్దేశం తప్ప మరొకటి లేదని విమర్శించారు.

భూసంస్కరణలు అమలు జరిగి పేదల చేతుల్లోకి భూమి వచ్చిన చోటనే అన్ని రకాల అభివృద్ధి జరుగుతుందన్నారు. ప్రపంచ అనుభవం అదే చెబుతుందన్నారు. కానీ మన దేశంలో నేటి ప్రభుత్వాలు పేదలకు భూపంపిణీ పక్కన పెట్టి పేదల భూములను కార్పొరేట్లకు, పెట్టుబడిదారులకు కట్టబెడుతున్నాయని మండిపడ్డారు. పేదలకు భూపంపిణీ కోసం చేసిన చట్టాలను తుంగలో తొక్కి దళిత, గిరిజన, బలహీనవర్గాల పేదలకు తీవ్రమైన దోహం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అభివృద్ధి అనే ముద్దు పేరు పెట్టి 2013 భూసేకరణ, పునరావాస చట్టాన్ని అమలు చేయకుండా దళితులు, పేదరైతులకు చెందిన భూములను బలవంతంగా తీసుకోరాదని, పేదల సాగులో ఉన్న ప్రభుత్వ బంజరు భూములకు, నివాస స్థలాలకు హక్కులు కల్పించాలని, అసైన్మెంట్ చట్టం అమలుకు తక్షణం అన్ని స్థాయిల్లో అసైన్మెంట్ కమిటీలను నియమించి భూ పంపిణీ చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



డిఆర్‌ఒ ఎఒకు వినతిని అందిస్తున్న నాయకులు



పోలిశెట్టి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు, ఉపాధ్యాయులు

నారాయణపురంలో పోలిశెట్టి వర్ధంతి సభ

ప్రజాశక్తి - ఉంగుటూరు

నారాయణపురం హైస్కూల్లో యుటిఎఫ్ ఉద్యమ నిర్మాత ఎస్ఆర్.పోలిశెట్టి వర్ధంతి సభ యుటిఎఫ్ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఉనుముల రాంబాబు, డాకి జోగినాయుడు ఆధ్వర్యంలో శనివారం జరిగింది. యుటిఎఫ్ గౌరవ అధ్యక్షులు శీతాల సత్యనారాయణ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు పోలిశెట్టి ఆదర్శప్రాయులన్నారు. అనంతరం కార్యవర్గ సమావేశంలో డాకి జోగినాయుడు కార్యదర్శి నివేదికను సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు హరికృష్ణ, ఆకివీడు వాణి, కోశాధికారి ఓ.ఆనందకుమార్, ఆడిట్ కన్వీనర్ టి.శ్రీధర్, జిల్లా కౌన్సిలర్లు అల్లు శ్రీను, పుప్పాల నరసింహారావు, గొల్లపల్లి రామారావు, కమల్ కుమార్, తూతిక శివయ్య, ప్రేమ్ కుమార్, రెడ్డి లక్ష్మణరావు, లక్ష్మీ నారాయణ, శేనాపతి రాజు, వర్మ పాల్గొన్నారు.




ముగ్గులు వేస్తున్న విద్యార్థులు

ఘనంగా సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి - చింతలపూడి

మన సంస్కృతి, సాంప్రదాయాలకు సంక్రాంతి వేదిక అని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాసరావు అన్నారు. కళాశాల ఆధ్వర్యంలో ఎర్రంపల్లిలో ఆరు రోజులుగా నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ ప్రత్యేక సేవా శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా శనివారం ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. భోగిమంటలు వేసి, మహిళలకు రంగవల్లుల పోటీ నిర్వహించారు.

ఉంగుటూరు : నారాయణపురంలోని శ్రీఅరవింద జయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సంక్రాంతి సందర్భంగా విద్యార్థులకు శనివారం వివిధ పోటీలు నిర్వహించారు. రంగోలి, తెలుగమ్మాయి, స్లో సైకిలింగ్, మేహెంది, గాలిపటాలు ఎగురవేసే పోటీలను నిర్వహించారు. అనంతరం భోగిమంటలు వేసి సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. విద్యార్థులంతా సాంప్రదాయ దుస్తుల్లో పండుగ వాతావరణాన్ని తీసుకొచ్చారు.



దీక్షలో పాల్గొన్న కార్మికులు

జీతాలు చెల్లించాలని దీక్ష

ప్రజాశక్తి - నూజివీడు

చాట్రాయి మండలంలోని చనుబండ గ్రామానికి చెందిన ఆరుగురు పారిశుధ్య కార్మికులకు జీతాలు చెల్లించే వరకూ నిరాహార దీక్ష కొనసాగుతుందని జనసేన పార్టీ ఉమ్మడి కృష్ణాజిల్లా అధికార ప్రతినిధి మరీదు శివరామకృష్ణ అన్నారు. శనివారం దీక్షా శిబిరాన్ని ఉద్దేశించి మాట్లాడారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలకు ప్రత్యేకంగా నియమించిన పారిశుధ్య కార్మికులు విస్సంపల్లి రమేష్, కారుమంచి బిక్షాలు, మొద్దు మరియమ్మ, విస్సంపల్లి ప్రసాదరావుకు జీతాలు చెల్లించడం లేదన్నారు. రెండు వారాల క్రితం నూజివీడు సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టి వినతిని అందించామని, అయినా నేటికీ సమస్య పరిష్కారం కాలేదన్నారు. దీంతో మరోసారి దీక్ష చేపడుతున్నారని తెలిపారు. ఈ దీక్షను ప్రారంభించిన మరీదు శివరామకృష్ణ, చాట్రాయి మండల అధ్యక్షులు ఆరెల్లి కృష్ణ, ప్రధాన కార్యదర్శి ఎం.సురేష్, జనసేన నాయకులు పాల్గొన్నారు. ఈ దీక్షకు సిఐటియు నాయకులు హనుమాన్, ఎఐటియుసి రాష్ట్ర నాయకులు చలసాని రామారావు, సిపిఐ ఏరియా కార్యదర్శి బత్తుల వెంకటేశ్వరరావు మరికొందరు మద్దతుతెలిపారు.

దీక్ష విరమణ

మండలంలోని చనుబండ గ్రామానికి చెందిన పారిశుధ్య కార్మికులు తమకు రావాల్సిన 39 నెలల జీతాలను చెల్లించాలని నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద రెండు రోజులుగా చేపడుతున్న నిరాహార దీక్షను శనివారం సాయంత్రం విరమించారు. నూజివీడు సబ్‌కలెక్టర్ ఆదర్శ రాజేందర్ హామీతో దీక్ష విరమించినట్లు జనసేన చాట్రాయి మండల అధ్యక్షులు ఆరెల్లి కృష్ణ తెలిపారు.

గ్రూప్-1 స్క్రీనింగ్ పరీక్షకు సర్వం సిద్ధం

6 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు

హాజరు కానున్న 3,106 మంది అభ్యర్థులు

జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూపు-1 స్క్రీనింగ్ పరీక్షలను జిల్లాలో ఈ నెల 8వ తేదీ ఆదివారం నిర్వహించేందుకు పటిష్ట ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ చెప్పారు. అత్యంత ప్రాముఖ్యత ఉన్న ఈ పరీక్షల నిర్వహణలో ఎలాంటి లోపాలూ తలెత్తకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామన్నారు. ఈ పరీక్షలకు 3,106 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని, దీనికి జిల్లా కేంద్రంలో ఆరు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పేపరు-1, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ పేపరు-2 పరీక్ష నిర్వహిస్తారన్నారు. ఉదయం 9 గంటల నుండి 9.30 గంటల వరకు అభ్యర్థులను పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తారని, మరో 15 నిమిషాలు గ్రేస్ పీరియడ్ ఉంటుందని పేర్కొన్నారు. ఆ తర్వాత వచ్చిన అభ్యర్థులను అనుమతించబోరని స్పష్టం చేశారు. మధ్యాహ్నం జరిగే పరీక్షకు అదే విధానం అమలు చేస్తారని, అలాగే పరీక్షా సమయం పూర్తయ్యేవరకు అభ్యర్థులను బయటికి వెళ్లేందుకు అనుమతించబోరని తెలిపారు. పరీక్షా కేంద్రానికి వచ్చే ముందు హాల్ టిక్కెట్లతోపాటు ప్రభుత్వం గుర్తించిన ఏదైనా ఒక ఒరిజినల్ ఫొటో గుర్తింపుకార్డు వెంట తీసుకురావాలని సూచించారు. కేంద్రంలోకి ఎలాంటి మొబైల్, బ్లూటూత్, స్మార్ట్ వాచ్, కాలిక్యులేటర్, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు అనుమతించబోరని ఆయన స్పష్టం చేశారు. వీటిని గుర్తించేందుకు పరీక్షా కేంద్రం వెలుపలే స్క్రీనింగ్ చేసేందుకు తగిన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. అభ్యర్థుల సౌకర్యార్థం ఫోన్ నెంబరు 9490172109, 9491041436లతో కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. పరీక్షా కేంద్రం సమీపంలో జిరాక్స్, ఆన్‌లైన్ కేంద్రాలను మూసివేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు. బ్లూ లేదా బ్లాక్ పాయింట్ బాల్ పెన్‌తో మాత్రమే పరీక్ష రాయాలన్నారు.

పరీక్షా కేంద్రాలివే

వట్లూరు సిఆర్ఆర్ ఇంజినీరింగ్ కళాశాల, వట్లూరు రైల్వేగేట్ సమీపంలోని సిఆర్ఆర్ పాలిటెక్నికల్ కళాశాల, వట్లూరు ఫ్లయ్ ఓవర్ సమీపంలోని సిఆర్ఆర్ మహిళా కళాశాల, ఏలూరు ఫైర్ స్టేషన్ సమీపంలోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాల, ఏలూరు మోర్ మార్కెట్ రోడ్డులోని నారాయణ బాలుర జూనియర్ కళాశాల, వట్లూరు ఫ్లయ్ ఓవర్ సమీపంలోని సిఆర్ఆర్ మహిళా జూనియర్ కళాశాల.

పరీక్షా కేంద్రాల్లో ఎస్‌పి తనిఖీలు

గ్రూప్-1 పరీక్షా కేంద్రాలను జిల్లా ఎస్‌పి రాహుల్‌దేవ్‌శర్మ శనివారం పరిశీలించారు. చైతన్య, నారాయణ, సిఆర్ఆర్, ఇంజినీరింగ్, సిఆర్ఆర్ పాలిటెక్నిక్ కాలేజీల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పి రాహుల్‌దేవ్‌శర్మ మాట్లాడుతూ పరీక్షా కేంద్రం వద్ద కట్టుదిట్టమైన భద్రతా చర్యలను తీసుకుంటున్నట్లు తెలిపారు. కేంద్రాల వద్ద ట్రాఫిక్ స్తంభించకుండా అవసరమైన చర్యలు తీసుకున్నామన్నారు. ఒక్కో పరీక్షా కేంద్రానికి ఒక్కో ఎస్ఐ ఇన్‌ఛార్జిగా ఉంటారని, రెండు కేంద్రాలకు ఒక సిఐ ఇన్‌ఛార్జిగా ఉంటారని తెలిపారు. ఎస్‌పి వెంట ఏలూరు ఇన్‌ఛార్జి డిఎస్‌పి జివిఎస్.పైడేశ్వరరావు, ఎస్‌బి ఇన్‌స్పెక్టర్ వి.రవికుమార్, ఎఆర్ డిఎస్‌పి కృష్ణంరాజు, ఏలూరు టూటౌన్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్‌రావు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్, పవన్ కుమార్ పాల్గొన్నారు.

మెనూ సక్రమంగా అమలు చేయాలి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

అంగన్‌వాడీ కేంద్రాల్లో మెనూ సక్రమంగా అమలు చేయాలని తహశీల్దార్ జి.ఎలీషా సూచించారు. శనివారం మండలంలోని పలు అంగన్వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రాల్లోని స్టాకును పరిశీలించారు. అనంతరం పలు రికార్డులను తనిఖీ చేశారు. పిల్లల ఆహార పదార్థాలను రుచి చూశారు. రక్త హీనత ఉన్న పిల్లలను గుర్తించి వారికి పోషకాహారం అందించాలని సూచించారు.

వైసిపి పతనం ఆరంభం : ముద్దరబోయిన

ప్రజాశక్తి - నూజివీడు

వైసిపి ప్రభుత్వ పతనం ఆరంభమైందని నూజివీడు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి, మాజీ శాసనసభ్యులు ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు చేపట్టిన 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' ఆదరణ చూసి సిఎం జగన్‌కు వణుకు పుడుతుందన్నారు.


సొంతింటికల నెరవేర్చడమే లక్ష్యం

రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ సంధ్య

ప్రజాశక్తి - మండవల్లి

పేదల సొంతింటి కల నెరవేర్చడమే సిఎంఎ జగన్ లక్ష్యమని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంట సంధ్య అన్నారు. మండలంలోని కానుకొల్లులో జగనన్న కాలనీలో చేపట్టిన ఇళ్ల నిర్మాణాలను ఆమె శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా సంధ్య మాట్లాడుతూ ఇల్లు లేని నిరుపేదలు రాష్ట్రంలో ఉండకూడదన్నారు. లబ్ధిదారులు త్వరితగతన ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి నాగదాసి థామస్, గ్రామ ప్రముఖులు పుట్టి సత్యనారాయణ హౌసింగ్ ఎఇ శేఖర్ పాల్గొన్నారు.

ముదినేపల్లి : జగనన్న ఇంటి పట్టాలు పొందిన లబ్ధిదారులు నిర్మాణాలు వేగవంతం చేయాలని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య అన్నారు. మండలంలోని పెదపాలపర్రులో శనివారం జగనన్న లే ఆవుట్ కాలనీలో లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటి వరకు ఇళ్ల నిర్మాణాలు చేపట్టని వారు వెంటనే పనులు ప్రారంభించాలన్నారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ పి.మల్లీశ్వరి, తశశీల్దార్ కె.శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ ఎఇ శ్రీనివాస్, వివిధ శాఖల మండలస్థాయి అధికారులు పాల్గొన్నారు.



మండవల్లిలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న సంధ్య

9న యధావిధిగా 'స్పందన'

ప్రజాశక్తి - ఏలూరు

స్థానిక జిల్లా కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో ఈ నెల తొమ్మిదో తేదీ సోమవారం ఉదయం 10 గంటల నుంచి 'స్పందన' కార్యక్రమం యధావిధిగా నిర్వహిస్తామని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా జిల్లాలోని అన్ని డివిజనల్, మండల, మున్సిపల్ కార్యాలయాల్లోను 'స్పందన' కార్యక్రమం యధావిధిగా నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఫిర్యాదుదారులు తప్పనిసరిగా కోవిడ్ నిబంధనలు పాటిస్తూ మాస్కు తప్పనిసరిగా ధరించి భౌతిక దూరం పాటించాలని కోరారు.

కట్టడి ఇలాగేనా..!

చర్చనీయాంశమైన కొండ్రుప్రోలులో యువతిపై దాడి ఘటన

దిశ యాప్, చట్టం పని తీరుపై అంతా ఆర్భాటమే

మహిళలకు అణువణువునా రక్షణ కల్పించేందుకు దిశ చట్టం తీసుకొచ్చామని ప్రజాప్రతినిధుల ఆర్భాటపు ప్రచారం.. దిశ యాప్‌తో మహిళల రక్షణకు కృషి చేస్తున్నామని పోలీసు అధికారుల హడావుడి.. అంతా బాగుంది. మరి 'అర్ధరాత్రి ఆడది ఒంటరిగా రోడ్డుపై తిరగగలిగిన నాడే దేశానికి స్వాతంత్ర్యం వచ్చినట్లు' అని మహాత్ముడు చెప్పిన మాట అటుంచి అర్ధరాత్రి ఆడది ఇంటి వద్ద తన కుటుంబ సభ్యులతో కలిసి సురక్షితంగా ఉంటే చాలనుకునే పరిస్థితి కొండ్రుప్రోలు ఘటన తెరపైకి తీసుకొచ్చింది.

తాడేపల్లిగూడెం మండలం కొండ్రుప్రోలు ఘటన మన వ్యవస్థలో లోపాలను తేటతెల్లం చేస్తోంది. గ్రామాల్లో చీమ చిటుక్కుమన్నా తెలిసేలా వాలంటీర్ల వ్యవస్థ, మహిళలకు సంబంధించి రక్షణకు మహిళా సంరక్షణ కార్యదర్శుల (మహిళా పోలీసులు)ను నియమించామని రాష్ట్ర ప్రభుత్వం గొప్పగా చెప్పుకుంటున్నా ఒక ఉన్మాది దాడిని నిలువరించకపోవడంలో వైఫల్యం వ్యవస్థలోని డొల్లతనాన్ని తేటతెల్లం చేస్తోంది. యువతిని కొంతకాలంగా ఉన్మాది వేధిస్తుండటం, ఈ విషయంపై ఆమె తండ్రి ఆ ఉన్మాదిని హెచ్చరించడం అందరికీ తెలియకపోవచ్చు. అయితే దానికి ప్రతీకారంగా ఆ ఉన్మాది బాధిత కుటుంబానికి చెందిన గడ్డివామి తగులబెట్టడం ఆ గ్రామంలో అందరికీ తెలిసిందే. మరి గ్రామంలోని అధికార వ్యవస్థ దృష్టికి ఈ ఘటన రాలేదా. వస్తే దీని వెనుక ఉన్న వాస్తవాలేమిటని పరిశీలిస్తే వేధింపుల అంశం బయటకు వచ్చేది. వెనువెంటనే పోలీసు శాఖ అప్రమత్తమై బాధిత కుటుంబంతో మాట్లాడటం, అదే సమయంలో ఆ ఉన్మాదిని తీవ్రంగా హెచ్చరించి ఉంటే దాడికి తెగబడే ధైర్యం సన్నగిల్లే అవకాశం ఉండేది. ధైర్యంగా ఇంట్లో ఉన్న యువతిని బయటికి రప్పించేలా ఆ ఇంటికి విద్యుత్ సరఫరా నిలిపివేసి విచక్షణారహితంగా దాడి చేశాడంటే ఎంతటి ఉన్మాదో స్పష్టమవుతోంది. గతంలో తణుకు ప్రాంతంలో కృపారాణి అనే మహిళ వేధింపుల ఫలితంగా బలవన్మరణానికి పాల్పడింది. అప్పటికీ ఈ దిశ చట్టం లేదు. యాప్ కూడా లేదు. మరి ప్రస్తుతం అవి అందుబాటులో ఉన్నా వాటిపై ప్రజల్లో.. ప్రధానంగా మహిళల్లో సరైన అవగాహన, నమ్మకం లేదని తాజా ఘటన రుజువు చేస్తోంది. వాలంటీర్లను వెంటబెట్టుకుని ఒక కానిస్టేబుల్, లేదా మహిళా పోలీసులకు టార్గెట్ పెట్టి జనసమ్మర్థ ప్రాంతాల్లో అందరి స్మార్ట్‌ఫోన్లలో దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేయించడంపై పెడుతున్న శ్రద్ధ అభినందనీయమే. అయితే యాప్ డౌన్‌లోడ్‌తోనే అంతా అయిపోతుందనుకుంటే మహిళలపై ఎందుకు ఇంకా అత్యంత భయంకరంగా అఘాయిత్యాలు చోటుచేసుకుంటున్నాయనేది ప్రభుత్వ పెద్దలు, ఉన్నతాధికారులు పరిశీలించాలి. యాప్ ద్వారా సాయం కోరిన మహిళకు రక్షణ అందించడమే కాకుండా నేరుగా పోలీసు స్టేషన్‌కు వచ్చిన బాధితురాలి వివరాలు బయటికి పొక్కకుండా జాగ్రత్తలు తీసుకునే దగ్గర నుంచి, బాధితురాలి ఫిర్యాదుపై శల్య ప్రశ్నలు, అవమాన, ఇబ్బందికర ప్రశ్నలు మాని దర్యాప్తుపై దృష్టి సారించి మృగాళ్ల ఆటకట్టిస్తే ఎంతోకొంత అధికార వ్యవస్థపై నమ్మకం పెరిగే అవకాశం ఉంటుంది. ఫిర్యాదు చేసి మరో కొత్త సమస్య తెచ్చుకోవడం ఎందుకనే అభిప్రాయం చాలా మందిలో నెలకొనడానికి పోలీసు శాఖ తీరే కారణం. కనీసం దిశ పోలీసు స్టేషన్‌లోనైనా అధికారులు మహిళలు అయ్యి ఉంటే కొన్ని సమస్యలు, ఇబ్బందులను స్వేచ్ఛగా చెప్పుకునే అవకాశం ఉంటుంది. అంతే తప్ప ఘటన జరిగినప్పుడు, ప్రభుత్వం పేరు కోసం పాకులాడుతూ హడావుడి, ఆర్భాటపు ప్రచారం వల్ల బాధితులకు ఒరిగేదేమీ ఉండదని, దాడులు కొనసాగుతూనే ఉంటాయని పరిశీలకులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు, అధికారులు ఆ దిశగా ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అంతే తప్ప జనం రోడ్లపైకొచ్చి తమ సమస్యలు చెప్పుకునే అవకాశం లేకుండా వారి గొంతు నొక్కేలా జిఒ నెం.1 వంటి వాటిని తీసుకురావడం ఆపి మృగాళ్ల కట్టడికి ఇంకేమి జిఒలు తీసుకురావాలి, అధికార యంత్రాంగంలో ఎటువంటి మార్పులు తీసుకురావాలనే దానిపై దృష్టి సారించాలని మహిళా లోకం కోరుతోంది.



-వివిఎస్ఎస్‌వి.ప్రసాద్

ప్రజాశక్తి
www.prajasakti.com

అంబేద్కర్ ఆలోచనలు అనుసరణీయం

అంబేద్కర్ యువజన సంఘం కార్యవర్గ ఎన్నిక

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

అంబేద్కర్ ఆలోచనా విధానాన్ని సమాజంలో ప్రతి ఒక్కరూ అనుసరించాలని స్థానిక దాంగేనగర్ అంబేద్కర్ యువజన సంఘం గౌరవ అధ్యక్షులు ఎన్.ప్రభాకరరావు అన్నారు. శనివారం సంఘ ఆరో వార్షికోత్సవం సందర్భంగా వ్యవస్థాపకులు అమ్మల రంగా అధ్యక్షతన నూతన కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా కె.లక్ష్మణరావు, పవన్ బాజీ, ఉపాధ్యక్షులుగా చల్లా రామకృష్ణ, సహాయ కార్యదర్శిగా దాసరి నాగరాజు, దొండు రవీంద్ర ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు, పవన్ బాజీ మాట్లాడుతూ కుల, మత, రాజకీయాలకు అతీతంగా ఏర్పడిన దాంగే నగర్ అంబేద్కర్ యువజన సంఘం ఐదేళ్లుగా అంబేద్కర్ ఆలోచన విధానంపై అవగాహన కల్పిస్తూ పలు సామాజిక సేవాకార్యక్రమాలు చేపట్టిందన్నారు. అంబేద్కర్ స్ఫూర్తిని, భావజాలాన్ని అనుసరిస్తూ ముందుకు సాగుతామని తెలిపారు. అలాగే ఈ నెల 12వ తేదీన అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు పూడి అప్పారావు, అమ్మల వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జనసేన గ్రౌండ్ కో ఆర్డినేషన్ కమిటీలో ధర్మరాజు

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఈనెల 12న శ్రీకాకుళం జిల్లా రణస్థలంలో జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ నిర్వహించనున్న యువశక్తి సభకు సంబంధించి ఇన్ గ్రౌండ్ కోఆర్డినేషన్ కమిటీలో ఉంగుటూరు నియోజకవర్గ పార్టీ ఇన్‌ఛార్జి పత్సమట్ల ధర్మరాజుకు స్థానం కల్పించారు. ఈ మేరకు ఆ పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ శనివారం ఆదేశాలు జారీ చేశారు. ధర్మరాజు మాట్లాడుతూ తనపై నమ్మకంతో అప్పజెప్పిన పనిని శక్తివంచన లేకుండా పూర్తి చేస్తామన్నారు. తన నియోజకవర్గం నుండి వేలాది మంది జనసైనికులు స్వచ్ఛందంగా వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ మేరకు రణస్థలంలో యువశక్తి సభ నిర్వహణపై సమాయత్త సమావేశంలో ధర్మరాజు మాట్లాడారు.

సమాజ సేవలో భాగస్వాములు కావాలి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

నిస్సహాయులను ఆదుకునేందుకు సమాజ సేవలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు జెట్టి గురునాథరావు అన్నారు. శనివారం స్థానిక అంబికా రెస్టారెంట్ వద్ద కాంగ్రెస్ సీనియర్ నేత, సినీ నటుడు, అంబికా హోటల్స్ అధినేత ఉక్కుర్తి దుర్గారావు పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి. కేక్ కట్ చేసి పేదలకు దుప్పట్లు, చీరల పంపిణీని గురునాథరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టినరోజులు, పెళ్లి వేడుకల, ఇతర శుభకార్యాలయాల సందర్భాల్లో సమాజ సేవ అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వృద్ధుల సంక్షేమ సంఘం జిల్లా నాయకులు రాధాకృష్ణమూర్తి, లయన్స్ క్లబ్ జిల్లా కేబినెట్ సభ్యులు ఉక్కుర్తి సీతారామ్, పలు సంఘాల, సంస్థల ప్రతినిధులు సోమరాజు, మొగిలిపిడి శ్యామ్, చిన్నం రాంబాబు, వెంకట్ పాల్గొన్నారు.

20న వైసిపి సారథుల నియామకం

ప్రజాశక్తి - భీమడోలు

ఉంగుటూరు నియోజకవర్గ పరిధిలో వైసిపి గృహసారథుల నియామకాన్ని ఈనెల 20వ తేదీన చేపట్టనున్నట్లు ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు తెలిపారు. సచివాలయ వాలంటీర్లు, పార్టీ సచివాలయ కన్వీనర్లతో ఆత్మీయ సమావేశం శనివారం భీమడోలులో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ సేవా దృక్పథంతో పనిచేస్తున్న వాలంటీర్లు ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధులై పనిచేస్తున్నారన్నారు. ప్రస్తుతం సచివాలయాల వారీగా పార్టీపరంగా నియమితులైన కన్వీనర్లు, గృహ సారథులు వాలంటీర్లకు వివిధ అంశాల్లో సహకరించాలని కోరారు.



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ డిఎన్ఆర్

వాలీబాల్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - కైకలూరు రూరల్

యువత సాంప్రదాయ క్రీడలపై ఆసక్తి కనబరచాలని ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు అన్నారు. శనివారం ఆలపాడులో పోలీసు శాఖ ఆధ్వర్యంలో నాలుగు రోజులపాటు జరగనున్న నియోజకవర్గస్థాయి వాలీబాల్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ తెలుగు సాంప్రదాయాన్ని ప్రతిబింబించే అతిపెద్ద పండుగ సంక్రాంతి అని, యువతను ప్రోత్సహించే క్రమంలో వారిలో క్రీడాశక్తిని వెలికి తీయడానికి క్రీడలు దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అడవి వెంకటకృష్ణమోహన్, వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షురాలు దండే పుష్పలత, రూరల్ సిఐ వైవిఎల్.నాయుడు, టౌన్ సిఐ నాగరాజు, రూరల్ ఎస్ఐ చల్లా కృష్ణ, వైస్ ఎంపిపి మహ్మద్ జహీర్, కైకలూరు సర్పంచి నవరత్నకుమారి, పోలీసు సిబ్బంది, క్రీడాకారులు పాల్గొన్నారు.



చింతలపూడిలో..

టాలెంట్ టెస్ట్‌లో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - భీమడోలు

ఇంటర్నేషనల్ టాలెంట్ సైన్స్ ఆర్గనైజేషన్ ఇటీవల నిర్వహించిన పరీక్షల్లో భీమడోలు శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపల్ డి.సోహిని తెలిపారు. మూడో తరగతి నుంచి పదో తరగతికి చెందిన 212 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా వీరిలో 85శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న పాఠశాల సమన్వయకర్త సిహెచ్.ఉదయ భాస్కర్, డీన్ భార్గవకుమార్ మాట్లాడుతూ శ్రీచైతన్య విద్యార్థులు విజయం సాధించేందుకు పాఠశాల అమలు చేస్తున్న ప్రణాళికల వల్ల వారు గుర్తింపు పొందుతున్నారని తెలిపారు. విద్యార్థులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఐఎన్‌టిఎస్ఒ బాధ్యులు శ్యామల రాజు పాల్గొన్నారు.

చింతలపూడి : గత ఏడాది నవంబర్‌లో జరిగిన జాతీయ స్థాయి ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలింపియాడ్ పరీక్షలో శ్రీచైతన్య టెక్నో పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.సత్యనారాయణ తెలిపారు. ఈ పరీక్షలో గణిత విభాగంలో 55 మంది, విజ్ఞాన శాస్త్రం విభాగంలో 38 మంది, ఆంగ్లంలో 37 మంది, జనరల్ నాలెడ్జ్ విభాగంలో 58మంది, ఆప్టిట్యూడ్ విభాగంలో 10 మంది విద్యార్థులు మొత్తం 198 మంది రెండో లెవిల్‌కి ఎంపికయ్యారన్నారు.

రోగులకు మెరుగైన సేవలందించాలి

ప్రజాశక్తి - కైకలూరు రూరల్

రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు వైద్యులకు సూచించారు. శనివారం సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ఆరోగ్యశ్రీ ఆరోగ్యమిత్ర ఛాంబర్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ రాంబాబు, ఎంపిపి అడవి వెంకట కృష్ణమోహన్, సర్పంచి నవరత్నకుమారి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

క్షతగాత్రుడు మృతి

ప్రజాశక్తి - భీమడోలు

రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న అర్జావారిగూడేనికి చెందిన యువకుడు విజయప్రకాష్ పరిస్థితి విషమించి శుక్రవారం అర్ధరాత్రి మృతిచెందాడు. ఎస్ఐ చావా సురేష్ తెలిపిన వివరాల మేరకు గత నెల 31వ తేదీన విజయప్రకాష్ ద్విచక్ర వాహనంపై వెళుతుండగా మండలంలోని భోగాపురం వద్ద టైరు పగిలి వాహనం అదుపుతప్పి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలు కావడంతో మెరుగైన వైద్యం కోసం విజయవాడ తరలించారు. అక్కడ పరిస్థితి విషమించి మృతిచెందాడు. ఎస్ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తెలంగాణ మద్యం పట్టివేత

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

తాటియాకులగూడెం అంతర్రాష్ట్ర తనిఖీ కేంద్రం వద్ద శనివారం ఎస్ఇబి సిఐ మణికంఠరెడ్డి అధ్వర్యంలో చేపట్టిన వాహన తనిఖీల్లో తెలంగాణ మద్యం పట్టుకున్నారు. తెలంగాణ రాష్ట్రం వరంగల్ నుంచి రాజమండ్రికి తరలిస్తున్న ఆరు మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని మణికంఠరెడ్డి తెలిపారు. మద్యంతోపాటు లారీని లారీని సీజ్ చేసి ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామన్నారు.

పేకాట స్థావరాలపై దాడి

కైకలూరు రూరల్:మండలంలోని పలు గ్రామాల్లో పేకాట స్థావరాలపై దాడులు చేసినట్లు టౌన్ సిఐ ఎంవిఎస్..నాగరాజు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తామరకొల్లు, ఆటపాక గ్రామాల్లో పేకాట ఆడుతున్న 15 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి రూ.5,330 నగదును సీజ్ చేసి వారిపై కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

గర్భిణులకు హెచ్ఐవి పరీక్షలు

గణపవరం: స్థానిక పిహెచ్‌సిలో శనివారం గర్భిణులకు హెచ్ఐవి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా పిహెచ్‌సి వైద్యులు పి.సంతోష్ నాయుడు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో భువనేశ్వరి ఆసుపత్రి వైద్యులు శుభాకాంతుసాహు, వైద్య సిబ్బంది విల్సన్ బాబు పాల్గొన్నారు

కొనసాగిన గడపగడపకూ మన ప్రభుత్వం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

స్థానిక 28వ వార్డులో చింతలపూడి ఎంఎల్ఎ ఉన్నమట్ల ఎలిజా గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం నిర్వహించారు. ప్రజల సమస్యలు అడిగితెలుసుకున్నారు. పలువురు తమ సమస్యలను ఎంఎల్ఎకి వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి, వైస్ ఛైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు, కంచర్ల వాసవి రత్నం పాల్గొన్నారు.

వైసిపిలోకి పలువురు చేరిక

ముదినేపల్లి :మండలంలోని గురజ గ్రామానికి చెందిన పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు శనివారం ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు సమక్షంలో వైసిపి తీర్థం పుచ్చుకున్నారు. వీరందరికి పార్టీ కండువాలు కప్పి సాదారంగా పార్టీలోకి ఆహ్వానించారు. కోనేరు వెంకటనరసింహారావు, కె.నాని, మండవ శ్రీను, పి.శోభనాద్రి, పుట్టి శ్రీహరి, కె.శ్రీను వారి అనుచరులు పార్టీలో చేరారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కృష్ణ చైతన్య కోరారు. శనివారం స్థానిక మున్సిపల్ కమిషనర్ భవానీ ప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన కృష్ణచైతన్య కార్మికుల సమస్యలపై వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి జెవి.రమణరాజు, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక బాధ్యతతో వాలంటీర్ల సేవలు

ప్రజాశక్తి - ముదినేపల్లి



సిఎం జగన్ ఆశయాలకు అనుగుణంగా గ్రామ వాలంటీర్లు పని చేస్తూ సామాజిక బాధ్యతను నెరవేరుస్తున్నారని సింగరాయపాలెం సర్పంచి బోయిన విమల అన్నారు. మండలంలోని సింగరాయపాలేనికి చెందిన బూరుబోయిన నాగమ్మ అనారోగ్యంతో కొద్ది రోజులుగా గుడివాడలోని ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఇంటివద్ద పింఛను ఇవ్వడానికి వెళ్లిన వాలంటీరుకు నాగమ్మ అక్కడ లేకపోవడంతో విషయం తెలుసుకుని ఆమెకు పింఛను ఇవ్వడానికి వాలంటీర్ బొమ్మనబోయిన నిరోషా సింగరాయపాలెం నుంచి తన సొంత ఖర్చులతో గుడివాడలోని ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నాగమ్మ వద్దకు వెళ్లి వితంతు పింఛను అందించింది. ఈ సందర్భంగా గ్రామ సచివాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో వాలంటీరు నిరోషాను సర్పంచి విమల, సచివాలయ కార్యదర్శి లక్ష్మీ, సచివాలయ ఉద్యోగులు అభినందించారు. అదేవిధంగా మండలంలోని పేరూరు శివారు తేరగూడేనికి చెందిన కె.వెంకటేశ్వరరావు డెంగీతో బాధపడుతూ పదిరోజులుగా విజయవాడలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. కొన్ని పరిస్థితులు వల్ల డిసెంబరు నెల పింఛను కూడా వెంకటేశ్వరరావు తీసుకోలేదు. మళ్లీ పింఛను తీసుకోకపోతే పోతుందనే భయంతో గ్రామ వాలంటీరు పి.రాజేష్ పేరూరు నుంచి తన సొంత ఖర్చులతో విజయవాడ వెళ్ళి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వెంకటేశ్వరరావుకు పంఛను అందించాడు. దీంతో రాజేష్‌ను సచివాలయ ఉద్యోగులు, గ్రామ సర్పంచి అభినందించారు.

అంత్యక్రియలకు డబ్బు వసూలు విరమించుకోవాలి

ప్రజాశక్తి - ఏలూరు

ఏలూరు శ్మశాన వాటికల్లో అంత్యక్రియలకు రూ.ఐదు వేలు వసూలు చేయాలనే మున్సిపల్ కౌన్సిల్ తీర్మానం రద్దు చేయాలని, పట్టణ అస్తి పన్నుల పెంపు వ్యతిరేక పోరాట కమిటీ కన్వీనర్ కట్టా సత్యనారాయణ డిమాండ్ చేశారు. శనివారం ఉదయం పవర్‌పేటలో జరిగిన కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటికే పట్టణ ప్రజలపై అస్తి, ఇంటి, చెత్త సేకరణ పన్నులు అంటూ రాష్ట్ర ప్రభుత్వం భారం మోపిందన్నారు. ఇలాంటి సమయంలో ఏలూరు మునిసిపల్ కార్పొరేషన్‌లో కొత్తగా శ్మశానవాటికల్లో అంత్యక్రియలకు డబ్బు వసూలు చేయాలంటూ తీర్మానం చేయడం గర్హనీయమన్నారు. ఆ తీర్మానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఏలూరులో ఇలా తీర్మానం చేయడం సిగ్గుచేటన్నారు. కాటి కాపర్లను మునిసిపల్ సిబ్బందిగా గుర్తించి వారికి కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఏలూరు శ్మశానవాటికల్లో అనేక సమస్యలు నెలకొన్నాయని, వాటిని పరిష్కరించాలని కోరారు. విద్యుత్ శ్మశాన వాటిక ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షులు కె.రామాంజనేయులు, అపార్ట్‌మెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు వివివిఎన్.ప్రసాద్, కమిటీ సభ్యులు సీతయ్య పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి వైసిపి కృషి : పుప్పాల

ప్రజాశక్తి - భీమడోలు



ప్రజాసంక్షేమానికి వైసిపి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని ఉంగుటూరు ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు అన్నారు. పెన్షన్ వారోత్సవాల్లో భాగంగా భీమడోలు సర్పంచి, సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్షులు పాము సునీతమాన్‌సింగ్ అధ్యక్షతన శనివారం జరిగిన నూతన పింఛన్ల పంపిణీలో ఎంఎల్ఎ పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతీ ఆరు నెలలకు ఒకసారి పింఛనుకు అర్హులైనవారికి మంజూరు చేస్తున్నారని తెలిపారు. భీమడోలు మండలంలో 21 మంది వైఎస్ఆర్ బీమా లబ్ధిదారులకు రూ.20.58 లక్షలు తాజాగా మంజూరయ్యాయన్నారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ రాష్ట్రస్థాయిలో తొలిసారిగా ఏలూరు కేంద్రంగా ఏవియేషన్ బెస్ట్ స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం నిర్వహించారన్నారు. భీమడోలు మండలానికి చెందిన ముగ్గురు డిగ్రీ తరువాత ఇందులో శిక్షణ పొంది విమాన రంగంలో అత్యధిక జీతాలకు ఉద్యోగాల పొందారన్నారు. వీరికి నియామకపత్రాలు అందజేశామన్నారు. ఈ సౌకర్యాన్ని ఇతర నిరుద్యోగులు వినియోగించుకోవాలని సూచించారు. భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని మినీ ఏరియా ఆసుపత్రిగా తీర్చిదిద్దేందుకు రూ.రెండు కోట్లతో అదనపు సౌకర్యాలు కల్పిస్తున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు తుమ్మగుంట భవానిరంగా, ఎంపిపి కె.ఆదాం, భీమడోలు సర్పంచి సునీతా మాన్‌సింగ్ ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో భీమడోలు సొసైటీ అధ్యక్షులు రాయపాటి సత్య శ్రీనివాస్, తహశీల్దార్ షంషుద్దీన్, ఎంపిడిఒ రాఘవన్ పాల్గొన్నారు.



ఉపాధ్యాయులకు సత్కారం

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను పురస్కరించుకుని యుటిఎఫ్ ఆధ్వర్యంలో పలువురు ఉపాధ్యాయులను స్థానిక యుటిఎఫ్ భవనంలో శనివారం సత్కరించారు. మండలానికి చెందిన ఉపాధ్యాయులు ఎం.సీతాదేవి, ఎస్.వెంకటలక్ష్మి, కెడివి.లక్ష్మీ, ఖమరున్నీసా, జాన్సీకుమారి, తులసీరాణి, శ్రీలక్ష్మీ, మహిళా కానిస్టేబుల్ అనూషను సత్కరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ అధ్యక్ష్య, కార్యదర్శులు పి.కృష్ణ, ఎం.జోగిరాజు, యుటిఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS AT NARASARAOPET
Dispute. No. 9/2022

Between:
KAPIL CHITS (KOSTA) PVT. LTD. Macherla Branch Represented by its, Legal Officer.
.... **Disputant**

A N D

SRINIVASARAO RANGA & Other
.... **Opponents**

To
1. SRINIVASARAO RANGA, S/o. Chennakesava Rao, aged about: 44years, Occ: Business, R/o. 11-3-148, RAMATAKIESLANE, MACHERLA, GUNTUR,ANDHRA PRADESH.
2. BABU RAO SIRIGINEEDI, S/o.RAMA KRISHNA S, aged about 40 years, Occ: Engineer In KCP Cement, R/o. 5-137/2, RELANGIIRARVARAM, GUMMAMPADU, W.GODAWARI,ANDHRA PRADESH.
3. RAVINDRA BABU LOKAM, S/o.APPAIAH L, aged about 31 years, Occ: Teacher, R/o. 1-25, NEAR BRIDGE, VEDASWARAM, GUNTUR DIST,ANDHRA PRADESH.
4. RAGHAVENDRA RAO DOGUPARTHI, S/o.PURNA CHANDRA RAO D, aged about 34 years, Occ: Chemist, R/o. E/102, KCP NEW COLONY, MACHARLA, GUNTUR DIST,ANDHRA PRADESH.

Whereas the Disputant has filed the above suit against you for recovery of Chit amount due and the suit was posted on 21-01-2023..

Hence, you are hereby informed to appear before this court on 21-01-2023. at 10.00 A.M, either by your self or through your Council. Failing which the matter will be decided Exparte.

// BY ORDER OF THE COURT //
J.SRINIVAS REDDY,
ADVOCATE,
Guntur Dist.
NARASARAO PET,
Date:01.01.2023

జూద క్రీడలు వద్దు.. సాంప్రదాయ క్రీడలు ముద్దు

గ్రామాల్లో పోలీసుల అవగాహనా కార్యక్రమాలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం



ఆగిరిపల్లి మండలంలో కోడిపందేల బరులను ధ్వంసం చేస్తున్న పోలీసులు

సంక్రాంతి సమయంలో యువత జూద క్రీడలను వీడి సాంప్రదాయ క్రీడలపై మొగ్గు చూపాలని డిఎస్‌పి కెవి.సత్యనారాయణ సూచించారు. శనివారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన కబడ్డీ, వాలీబాల్ పోటీలను డిఎస్‌పి కెవి.సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత కోడిపందేలు పేకాట వంటి జూద క్రీడల వల్ల భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారన్నారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే క్రీడలు, ముగ్గుల పోటీల్లో గెలుపొందిన వారికి నవభారత్ పామాయిల్ ఫ్యాక్టరీ వితరణతో ఆకర్షణీయమైన బహుమతులు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిఐ బాల సురేష్ బాబు, ఎస్ఐ సాగర్ బాబు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ముసునూరు:యువత సాంప్రదాయ క్రీడలపై దృష్టి పెట్టాలని, పేకాట, కోడిపందేలకు దూరంగా ఉండాలని ఎస్ఐ ఎం.కుటుంబరావు అన్నారు. శనివారం మండలంలోని ముసునూరు మండపం సెంటర్ వద్ద గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

బుట్టాయగూడెం:యువత కోడిపందేలు, పేకాట వంటి వాటికి దూరంగా ఉండాలని తహశీల్దార్ శాంతి అన్నారు. ఈ మేరకు స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో తహశీల్దార్ శాంతి, ఎస్ఐ జయబాబు ఆధ్వర్యంలో జూద క్రీడల వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా కోడి పందేలు, ఇతర జూద క్రీడలకు దూరంగా ఉండాలని, సంక్రాంతి పండుగను కుటుంబంతో కలిసి సంతోషంగా జరుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఎఒ వెంకటలక్ష్మి, సచివాలయ సిబ్బంది, యువత పాల్గొన్నారు.

కోడిపందేలకు ఏర్పాట్లు చేస్తే బైండోవర్

ఆగిరిపల్లి:సంక్రాంతి ముసుగులో కోడి పందేలు నిర్వహించేందుకు బరులను ఏర్పాటు చేస్తే వారిపై బైండోవర్ కేసులు నమోదు చేస్తామని నూజివీడు రూరల్ సిఐ ఆర్.అంకబాబు హెచ్చరించారు. శనివారం నెక్కలంగొల్లగూడెం శివారులోని మామిడితోటల్లో ఏర్పాటు చేసిన కోడిపందేలబరులను ఎస్ఐ ఎన్.చంటిబాబుతో కలిసి ధ్వంసం చేశారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, మహిళా పోలీసులు పాల్గొనారు.

గణపవరం : పండుగ పేరుతో గ్రామాల్లో కోడిపందేలు, పేకాట నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ వి.వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం వెలగపల్లి, జల్లికొమ్మర గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో తహశీల్దార్ ఎం.సన్యాసిరావు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

చింతలపూడి : కోడిపందేలు, పేకాట వంటి వ్యసనాలబారిన పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని తహశీల్దార్ కృష్ణజ్యోతి, ఎస్ఐ డి.హరికృష్ణ యువతకు సూచించారు. ఈ మేరకు సీతానగరం సచివాలయం వద్ద అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి కె.రామారావు, సర్పంచులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేత గొల్ల జోగిరాజు మృతికి సంతాపం

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శ గొల్ల జోగిరాజు మృతికి ఏలూరు నగర కాంగ్రెస్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి ప్రకటించింది. జోగరాజు ఇంటికి వెళ్లి ఆయన చిత్ర పటానికి కాంగ్రెస్ నేత రాజనాల రామ్మోహన్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ లీగల్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మంగళపూరి శ్రీనివాసరావు, బ్లాక్ టూ అధ్యక్షులు లంక రామ్మోహన్, జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్ర శేఖర్ గౌడ్, రంగబాబు, చక్రవర్తి, ప్రతాప్, సుబ్రహ్మణ్యశర్మ, సుబ్బారావు, భూషణం నివాళులర్పించారు.

పేదలకు అండగా వైసిపి : కొఠారు

ఏలూరు టౌన్:పేదలకు అండగా నిలిచిన ప్రభుత్వం తమదేనని దెందులూరు ఎంఎల్ఎ కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం శనివారానికి వంద రోజులు పూర్తయిన సందర్భంగా శత దినోత్సవాన్ని మాదేపల్లిలో మాదేపల్లి సర్పంచి కె.ప్రభుదేవ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ఏలూరు, పెదవేగి, పెదపాడు, దెందులూరు మండలాల నుండి పెద్దఎత్తున వైసిపి ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలి వచ్చారు.

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS AT NARASARAOPET
Dispute. No. 11/2022

Between:
KAPIL CHITS (KOSTA) PVT. LTD. Macherla Branch Represented by its, Legal Officer.
.... **Disputant**

A N D

SUBBARAO PANDI & Other
.... **Opponents**

To
1. SUBBARAO PANDI, S/o. Seshaiah, aged about: 46years, Occ: Head Constable SPF- 1119, R/o. 9-7-335, EASTMARUTHI NAGAR, CHAMPAPET, SANTHOSH NAGAR,SANTHOSH NAGAR,HYD.
2. NARAYANA RAO POLAKI, S/o.RAMULU P, aged about 38 years, Occ: Head Constable SPF-1518, R/o. 3-60, EDUREPALLI,KEDARI PURAM, PALASA, SRIKAKULAM DIST,ANDHRA PRADESH.
3. RANJITH VUPPULA, S/o.RAJENDER V, aged about 29 years, Occ: Constable SPF-4409, R/o. 1-1-1584, KAZIPET, VENKATADRI NAGAR, HANUMAKONDA, WARANGAL DIST,TELANGANA.
4. RAGHAVA RAO GOBERU, S/o.SREE RAMA KRISHNA G, aged about 35 years, Occ: Constable SPF-3254, R/o. 6-11, GUNTALA,POLAVARAM MD, WEST GODAVARI DIST, ANDHRA PRADESH.
5. VANESH KUMAR THODETI, S/o.YELLAIAH T, aged about 44 years, Occ: Constale SPF-1906, R/o. 1-68/2, YELLAMBAZAR, WARANGAL DT, T.G.
6. DURGARAO PALAKEEDU, S/o.NARASAIAH P, aged about 29 years, Occ: Constable SPF-4991, R/o. 2-3-603/49/B, NEW PREM NAGAR , AMBARPET, HYDERABAD, T.G.

Whereas the Disputant has filed the above suit against you for recovery of Chit amount due and the suit was posted on 21-01-2023

Hence, you are hereby informed to appear before this court on 21-01-2023 at 10.00 A.M, either by your self or through your Council. Failing which the matter will be decided Exparte.

// BY ORDER OF THE COURT //
J.SRINIVAS REDDY,
ADVOCATE,
Guntur Dist.
NARASARAO PET,
Date: 01.01.2023

చెరువు అభివృద్ధికి నిధులు కోరుతూ వినతి

టి.నరసాపురం:మక్కినవారిగూడెం జమ్మి చెరువు అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ వైసిపి నాయకులు పిన్నమనేని మురళీ, తుమ్మూరి శ్రీనివాసరెడ్డి, సిహెచ్.దుర్గాప్రసాద్ జలవనరుల శాఖమంత్రి అంబటి రాంబాబును విజయవాడలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు వారు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జమ్మి చెరువు సుమారు 110 ఎకరాల విస్తీర్ణంతో మూడు వేల ఎకరాల ఆయకట్టు కలిగి ఉందన్నారు. 2018లో కురిసిన భారీ వర్షాలకు చెరువు కళింగ పూర్తిగా ధ్వంసమైందని, చెరువులో నీటి నిల్వలు లేకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని వివరించారు. చెరువుకు సరిహద్దున గల మద్రిగూడెం, బండివారిగూడెం, టి.నరసాపురం పంచాయతీల్లో భూగర్భజల నీటి మట్టం తగ్గిందని, ఈ క్రమంలో జమ్మి చెరువు అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరామని తెలిపారు.

మహారాజశ్రీ ఏలూరు అ॥సి॥ సివిల్ కోర్టులో
E.P.No. 46/2018
O.S.No. 349/2014

బిట్వీన్:
Md.Akbar Saleem ...*DHR*
AND
అనగాని రంగారావు
అనగాని గోపాలమ్మ ...*JDR's*

పై నెంబరు వారెంటు గ్రంథంలో డిక్రీ బాకీ వసూలు నిమిత్తం పై ఏలూరు అ॥సి॥సివిల్ కోర్టులో **ది.20-01-2023న ఉదయం గం॥ 10:30 ని॥ల నుండి బహిరంగ వేలం వేయబడును.** కావలసిన వారు సదరు వేంలో పాల్గొని పాడుకొనవచ్చును.

షెడ్యూలు

ప॥గో॥జిల్లా, ఏలూరు సబు రిజిస్ట్రీ, పెదవేగి మండలం, లక్ష్మీపురం గ్రామం, ఆర్.ఎస్.నెం.767/8, దక్షిణం ప్రక్క Ac.0-20 Cents Out of Ac.1-00 భూమికి హద్దులు (కోర్టు ఆర్డరు ప్రకారం)
తూర్పు: అనగాని రాజారావు
పడమర: తాతా పోతురాజు
దక్షిణం: కొమ్మరెడ్డి విజయలక్ష్మి
ఉత్తరం: కొనకళ్ళ రాజు వగైరా

డి.హెచ్.ఆర్. విలువ : రూ. 5,00,000/-
అమీనా విలువ : రూ.5,00,000/-
డి.ఎస్.వి.మాణిక్యాలరావు
అడ్వకేట్, ఏలూరు.

సేల్ నోటీసు
మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్‌సివిల్ జడ్జి : ఏలూరు
ఇ.పి.నెం. 79/2019
ఓ.ఎస్.నెం. 74/2014

బిట్వీన్:
మంత్రిప్రగడ వేణుగోపాలరావు
...*పిటీషనరు /డి. హెచ్.ఆర్*
అండ్
1) పెదకోటి నరశింహారావు (డైడ్)
2) పెదకోటి శ్రీనివాసరావు
...*రెస్పాండెంట్లు /జె.డి.ఆర్స్*

పై నెంబరు గల గ్రంథములో రెస్పాండెంట్లు /జె.డి.ఆర్స్., డి.హెచ్.ఆర్. గారికి చెల్లించవలసిన బాకీ వసూలు నిమిత్తం ఈ క్రింది పేర్కొన్న షెడ్యూలు ఆస్థిని శ్రీ కోర్టు వారు బహిరంగ వేలము వేయుటకు గాను పేపరు పబ్లికేషనుకు ఆర్డరు వేసియున్నారు. కావున సదరు ఆస్థిని **ది.31-01-2023వ తేదీన దావా ఆస్థిని అమ్ముటకు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఏలూరు వారి కోర్టులో బహిరంగ వేలము జరుపబడును.** ఔత్సాహిక కొనుగోలు దారులు పై కోర్టు వారి ఎదుట ఉదయం గం॥ 10:30 ని॥లకు వారి యొక్క ఐడెంటీలతో వేలంలో పాల్గొని షెడ్యూలు ఆస్థిని పొందగలరు.

షెడ్యూలు

పశ్చిమ గోదావరి జిల్లాలోని ఏలూరు మండలం, మల్కాపురం గ్రామంలో ఆర్.ఎస్.నెం. 312లో డో.నెం. 2-45 ఉత్తరం వైపున గల 454 చ॥గ॥ స్థలములో 201.06 చ॥గ॥ ఇంటి స్థలమునకు హద్దులు:
తూర్పు: పంట కాలువ మరియు జాయింటు దారి.
పడమర: బూరెల నాగమణి.
ఉత్తరం: లుకలాపు దుర్గారావు.
దక్షిణం: పెదకోటి సింహాచలం వారి స్థలం.

ఇదే ఆర్.ఎస్.నెం.లో 14.4 చ॥గ॥ దారి స్థలము 1/3వ అవిభక్త హక్కుతో.

డి. హెచ్.ఆర్.విలువ : రూ. 4,00,000/-
రిజిస్ట్రార్ విలువ : రూ. 8,04,240/-

నరుకుళ్ళ కృష్ణమూర్తి
నక్కా మదన మోహన నాగరాజు
మల్లిడి ప్రభాకర రెడ్డి
అడ్వకేట్స్, ఏలూరు.
సెల్: 98481 07518

మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, తణుకు, ప॥గో॥జిల్లా
ఈ.పి.నెం.70/2018 ఇన్
ఓ.యస్.నెం.202/2010

బిట్వీన్:
కంచి మంగాయమ్మ ...*డి. హెచ్.ఆర్ /వాది*
మరియు
జోగి రాఘవులు వగైరా
...*జే.డి.ఆర్స్ /ప్రతివాదులు*

డి.హెచ్.ఆర్ /వాది తరుపున చేసిన వేలం ప్రకటన

పై నెంబరు గ్రంథం నందు జె.డి.ఆర్స్ తాలూకు దిగువ ఈ.పి.షెడ్యూల్ ఆస్తి **ది.23-01-2023వ తేదీన ఉదయం 10:30 గం॥ల లగాయితు తణుకు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు వారి ఎదుట బహిరంగ వేలం జరుగునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.**

షెడ్యూల ఆస్తి వివరం

పశ్చిమ గోదావరి జిల్లా, భీమవరం జిల్లా రిజిస్ట్రార్, తణుకు సబ్‌డివిజన్‌లో చేరిన ఇరగవరం మండలం, కాకుల ఇల్లిందలపర్రు గ్రామ పంచాయితీ ఏరియాలో సదరు గ్రామం తాలూకు రి.స.నెం. 112/1రు దాఖలా డో.నెం. 4-131కు సమీపాన గల 91.7.0 చ॥గ॥ (లేదా) 76.72 చ॥మీ॥ స్తలము అందుగల ఆర్.సి.సి. డాబాకు హద్దులు కొలతలు:
తూర్పు: పంచాయితీ రోడ్ -29 అడుగులు.
దక్షిణం: చింతపల్ల రామలక్ష్మి గారి స్థలం -27 అడుగులు.
పడమర: జోగి రంగారావు గారి కుమారుని తాలూకు స్థలం -32 అడుగుల 3 అంగుళాలు.
ఉత్తరం: గ్రామకంఠం పోరంబోకు భూమి -27 అడుగులు.

పై హద్దుల మధ్య చ॥గ॥ 91.7.0ల స్థలమున్నూ అందు గల 510 చ॥అ॥లలో గల ఆర్.సి.సి. డాబాయున్నూ, ఒక కొబ్బరి చెట్టు, ఒక హేండ్ పంపు, నెం.247 గల ఎలక్ట్రికల్ సర్వీస్ న్నూ, యావత్తూ ఈజిమెంట్ హక్కులు వగైరాలతో సహా.

డి.హెచ్.ఆర్. విలువ : రూ.3,00,000/-
జె.డి.ఆర్. విలువ : తెలుపలేదు
అమీనా విలువ : రూ.11,00,000/-లు
మార్కెట్ విలువ (సర్టిఫికెట్ ప్రకారం) : రూ.6,00,670/-

శ్రీగోటేటి భాస్కరమూర్తి,
శ్రీగోటేటి సత్యవెంకట వరప్రసాద్,
తణుకు, అడ్వకేట్స్, తణుకు-534211
06-01-23. సెల్: 93900 18122